క్లుప్తంగా

కరపలో 76.80 శాతం పింఛన్ల పంపిణీ



వేములవాడలో వెంకటమహాలక్ష్మికి పింఛను అందజేస్తున్న వలంటీర్ కృష్ణచైతన్య

కరప: మండల పరిధి 23 గ్రామాల్లో 11,452 మంది పింఛను లబ్ధిదారుల్లో మొదటిరోజు బుధవారం 8,795 మందికి (76.80 శాతం) అందజేసినట్టు ఎంపీడీఓ కర్రె స్వప్న తెలిపారు. రూ.3,12,64,500 లబ్ధిదారులకు బటాద్వా చేయాల్సి ఉండగా రూ 2,39,56,250 ఇచ్చినట్టు తెలిపారు. గురు, శుక్రవారాల్లో నూరుశాతం పూర్తిచేయిస్తామని ఆమె చెప్పారు. ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. గొర్రిపూడి-1 సచివాలయంలో 87.38 శాతం, యండమూరు సచివాలయం 84.79 శాతం, నడకుదురు-1 సచివాలయం 81.67 శాతం, వాకాడ సచివాలయంలో 81.39 శాతంతో పింఛన్ల పంపిణీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాల్లో నిలిచాయి.

చెక్కు అందజేత



ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదలైన చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుని కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా విడుదలైన రూ.3 లక్షల చెక్కును ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి బుధవారం అందజేశారు. పర్లోపేటకు చెందిన చింతపల్లి సింహాద్రి రెండేళ్ల క్రితం బోటు నుంచి జారిపడి మృతిచెందాడు. ఎమ్మెల్యే ద్వారంపూడి సీఎం దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లి సొమ్ము విడుదల చేయించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకులు దిబ్బాడ పెదబాబు, మృతుని కుటుంబ సభ్యులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం ఆందోళన

కాకినాడ సిటీ: కేంద్ర బడ్జెట్ కేటాయింపులపై కలెక్టరేట్ వద్ద సీపీఎం బుధవారం ఆందోళన చేపట్టింది. నాయకులు దువ్వా శేషుబాబ్జీ, కె.సత్తిరాజు, సీహెచ్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఈ బడ్జెట్ సంపన్నులకు వరాలు కురిపిస్తూ సామాన్యులపై భారాలు మోపుతుందని విమర్శించారు. అంబేద్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు, సీపీఎం నాయకులు జి బేబీరాణి, మేడిశెట్టి వెంకటరమణ, మలక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సత్రం భూమి వద్ద హెచ్చరిక బోర్డులు



సత్రం భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలోని సర్వే నెంబర్ 30లో బొగ్గవరం సత్రానికి చెందిన ఎకరం భూమి వద్ద దేవదాయ, ధర్మదాయ శాఖాధికారులు బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ భూముల ఆక్రమణ యత్నంపై ఎమ్మెల్యే కన్నబాబు, అధికారులు సమీక్షించి ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు సత్రం ఈవో శివబాబు, జిల్లా ఎండోమెంట్ అధికారి సూర్యనారాయణ మూర్తి, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఫణి తదితరులు హైకోర్టు విచారణలో వ్యవహారం ఉన్నందున క్రయవిక్రయాలు చెల్లవని, ఎవరైనా ఆక్రమించాలని చూస్తే చట్టప్రకారం శిక్ష అర్హులంటూ బోర్డు ఏర్పాటు చేశారు.

ప్రజాసమస్యలపై పోరాటం

బాలాజీచెరువు: ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి ముత్తా శశిధర్ పేర్కొన్నారు. మన ప్రాంతం-మన సచివాలయం భాగంగా బుధవారం రామకృష్ణారావుపేట తోటమ్మ దేవాలయం ప్రాంతాల్లో సమస్యలు తెలుసుకున్నారు. ఈయన వెంట మొయిద్దీన్, నీలపు సూరిబాబు లు ఉన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు ఆదరణ

కరప: బీసీలను ఆదరించి, వారికి రిజర్వేషన్లు కల్పించింది టీడీపీ హయాంలోనే అని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అన్నారు. మండలం గొర్రిపూడిలో బుధవారం ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ మీ అనంతలక్ష్మి నిర్వహించారు.

టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా పాండవులు

కరప గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా కొండేపూడి ధర్మారావు(పాండవులు)ను నియమించినట్టు ఆపార్టీ మండలశాఖ అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు బుధవారం ఒకప్రకటనలో తెలిపారు.

వైభవంగా భీష్మ ఏకాదశి

- భక్తులతో కిక్కిరిసిన వైష్ణవ ఆలయాలు
- కమనీయంగా కల్యాణాలు
- వసతులు కల్పించిన ఆలయ కమిటీలు



కాకినాడ జగన్నాథపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: భీష్మ ఏకాదశి సందర్భంగా నగరంలోని వైష్ణవాలయాలు బుధవారం గోవింద నామస్మరణతో మార్మోగాయి. గాంధీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈవో శ్రీనివాస్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో, దేవాలయంవీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో, వెంకట్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, మెహర్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు బారులు తీరారు.

నేత్ర పర్వంగా వేంకటేశ్వర కల్యాణం

స్థానిక జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణం నేత్ర పర్వంగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకులు పాందూరు రంగాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు.

కరపలో..

కరప: మండలంలో కరప, పెనుగుదురు, జెడ్.భావవరం, కూరాడ, చినమామిడాడ, యండమూరు గ్రామాల్లోని విష్ణాలయాల్లో, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు చేశారు. రామాలయాల్లో భజనబృందాలతో ఏకాహం నిర్వహించారు. కరప విష్ణాలయంలో అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ, యండమూరు వెంకటేశ్వర ఆలయంలో అర్చకులు పెద్దింటి సీతారామం పూజలు చేశారు. కరప కొత్తపేట రామాలయ కమిటీ ప్రతి ఇంటిగోడలపైన ఓం శ్రీరామ అని రాయించి శ్రీరామప్రచారం చేశారు. కొరుపల్లిలోని రామాలయంవద్ద శ్రీరామసప్తాహం ప్రారంభించారు. కరప కొత్తపేట రామాలయం, వలసపాకల, వేములవాడలోని రామాలయం వద్ద శ్రీరామ సప్తాహం, సంకీర్తనలు ఆలపించారు.



జగన్నాథపురంలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఆయా ఆలయాల వద్ద కమిటీసభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామివారి దివ్యకళ్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. వైఖానస మహదాచార్య చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. వంశ పారంపర్య అర్చకుడు పెద్దింటి సీతారామం వెంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ధ్వజారోహణం, గరుడోత్సవం నిర్వహించారు. దేవదాయశాఖ ఈఓ పీవీఎస్ సూర్యనారాయణ రాజు, కె.రఘు కల్యాణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆధ్యాత్మికవేత్త డాక్టర్ శిరీష తదితరులు

మహా పర్వదినం భీష్మ ఏకాదశి

కాకినాడ రూరల్: శౌర్య ప్రతాపంలో అసమాన ప్రతిభ కలిగిన భీష్మాచార్యుడు మాఘ మాస శుద్ధ ఏకాదశి రోజున పరమపదించడంతో భీష్మ ఏకాదశిగా హిందువులందరూ ఆయనను పూజిస్తారని ఆధ్యాత్మికవేత్త డాక్టర్ శిరీష పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో శ్రీరామ నామ క్షేత్రం ఆంధ్ర భద్రాద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో మాట్లాడుతూ భీష్ముడు ధర్మరాజుకి విష్ణు సహస్రనామాన్ని బోధించిన పవిత్రమైన రోజు ఏకాదశి అన్నారు. రాజా, అడబాల రత్న ప్రసాద్ పాల్గొన్నారు.



కరపలోని వేణుగోపాలస్వామి



యండమూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

ఘనంగా మల్లేశ్వరస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి

కరప: అరట్లకట్టలో అతి పురాతన శివాలయంలో బుధవారం భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొంతేటి సూర్యదత్త శివకుమార్ పూజాదికాలు నిర్వహించారు. రాత్రి స్వామివారి కళ్యాణాన్ని నిర్వహించారు. దేవదాయశాఖ ఈఓ వడ్డాది సత్తిబాబు, చీరట్ల శ్రీను గ్రామస్తులు స్వామి కళ్యాణోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అరట్లకట్ట పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణికి సత్కారం



శ్రీరమణిని సత్కరిస్తున్న పంచాయతీరాజ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర అధికారులు

కాకినాడ సిటీ: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పీడీ కె.శ్రీరమణిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖామంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి బి రాజశేకర్, సెర్ప్ సీఈవో అహమ్మద్ ఇంతియాజ్ తదితరుల నుంచి ఘన సన్మానాన్ని అందుకున్నారు. బుధవారం విజయవాడ సెర్ప్ కార్యాలయంలో రాష్ట్ర డీఆర్‌డీఏ పీడీలతో నిర్వహించిన సమీక్షలో ఆమెను సత్కరించారు. మహిళా సంక్షేమ పథకాల అమలులో తమదైన ముద్రను వేసుకున్న శ్రీరమణిని వారు సత్కరించారు.

ప్రాధాన్యక్రమంలో ఆలయాల అభివృద్ధి



కరపలో గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఉప్పాలమ్మ ఆలయ ముఖద్వారానికి ప్రారంభోత్సవం

కరప: నియోజకవర్గ పరిధిలో ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కరపలో గ్రామ దేవత ఉప్పాలమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా వైస్ ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు సోదరులు తమ తల్లిదండ్రులు పాట్నీడి సూర్యకాంతం, శంకరరావుల జ్ఞాపకార్థం నిర్మించిన ఆలయ ముఖద్వారాన్ని ఆయన ప్రారంభించారు. ఆలయాల పరిస్థితిని సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లానని, ఈ పునర్నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. దాతల విరాళాలతో మరింత మెరుగ్గా దీనిని నిర్మించినట్టు తెలిపారు. అమ్మవారి విగ్రహాన్ని, ఆలయాన్ని, ముఖద్వారాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన సంపర శిల్పి డేగల శ్రీరాములు (సాయిబాబు) పనితనాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ముందుగా వైస్ ఎంపీపీ సత్యభీమేశ్వరరావు కుటుంబసభ్యులు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, గ్రామసర్పంచ్ సాదే ఆశాజ్యోతి కుమార్ తదితరుల నడుమ ఈ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం బాలాలయంలోని ఉప్పాలమ్మతల్లిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయకమిటీ సభ్యులు, వివిధగ్రామాల నాయకులు, పాల్గొన్నారు.

5న విగ్రహప్రతిష్ఠకు పూజలు

పునర్నిర్మించిన ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు పూజా కార్యమాలను అంబాజీపేట మండలం మొసలపల్లి వాస్తవ్యుడు బ్రహ్మశ్రీ పి.సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు విరాళంగా ఇచ్చిన 8 గరగలకు పూజలు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, ఈఓ వడ్డాది సత్తిబాబు, కరప సిద్ధాంతి గాధావఝుల కొండయ్య సిద్ధాంతి పాల్గొన్నారు.

ప్రతీ హిందువు ధర్మరక్షకుడు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న రఘు

కరప: సమరసత సేవాఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు రూ.వంద చెల్లించి ధర్మరక్షకుడిగా మారాలని సంస్థ జిల్లా ధర్మప్రచారక్ పడాల రఘు కోరారు. స్థానిక నీలయ్యతోట వీధిలో బుధవారం ఫౌండేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18వ తేదీ వరకు సభ్యత్వ నమోదు చేయడం జరుగుతుందన్నారు. మండల కన్వీనర్ కాదా సత్యానారాయణ, సహ కన్వీనర్ కె.రామకృష్ణ, సన్యాసిరావు, ముమ్మిడి శ్యామ్‌సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

పబ్బినీడి మృతికి పలువురి సంతాపం



పబ్బినీడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు

కరప: గురజనాపల్లి మాజీసర్పంచ్ పబ్బినీడి సత్యనారాయణ మృతికి కేంద్ర మాజీమంత్రి ఎంఎం పళ్లంరాజు, వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. గురజనాపల్లిలో పబ్బినీడి చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన కుమారుడు వైఎస్సార్ సీపీ నాయకుడు పబ్బినీడి పాపారావును, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పీసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, మట్టా ప్రసాద్, ఆకుల వెంకటరమణ, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరు రాజు, తోట రాంజీ, కరప మండల మాజీ అధ్యక్షురాలు కమిడి సీతామహాలక్ష్మి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

జిల్లాలో 2.36 లక్షల మందికి పింఛన్ల పంపిణీ

కాకినాడ సిటీ: జిల్లాలో బుధవారం వైఎస్సార్ పింఛన్ కానుక కింద 2.36 లక్షల మందికి పింఛన్లు అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి బుధవారం రాత్రి తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి పంపిణీ ప్రారంభించి రాత్రి 8.40 గంటల వరకు 85.87 శాతం అందించారన్నారు. జిల్లాలో 2,75,441 మందికి రూ.75.77 కోట్లు అందజేస్తున్నామన్నారు. మరో నాలుగు రోజుల్లో నూరుశాతం అందించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు పీడీ వివరించారు.

ప్రజల ప్రతి కష్టానికి పథకం



గడపగడపకు మన ప్రభుత్వంలో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- గడపగడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: పేదల ప్రతి కష్టానికి ఒకొక్క పథకం అమలులో ఉందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 7వ డివిజన్ రేచర్లపేట తలుపులమ్మ తల్లి ఆలయం నుంచి బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, కమిషనర్ కె.రమేష్, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, పలువురు అధికారులు, మాజీ కార్పొరేటర్లు ఆయన వెంట ఉన్నారు. ప్రతి ఇంటికీ ఎమ్మెల్యే వెళ్ళి నవరత్న పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డు కాకూడదని, అమ్మ ఒడి, విద్యాదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలు సీఎం అమలు చేస్తున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేసిన ఆయనను మరోసారి ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏ సుబాబు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, టీపీ ఆర్వో మానే కృష్ణమోహన్, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తొంపల తాతారావు, మాజీ కార్పొరేటర్ సిగల మధు, స్థానిక నాయకులు బత్తిన రాజు, నంద కుమార్, దొర్ల సుశీల తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు



పెద్దమార్కెట్ ప్రాంతంలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ రమేష్

కాకినాడ: సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగులు కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ కోరారు. బుధవారం ఆయన 39, 40 డివిజన్ల సచివాలయాలను తనిఖీ చేశారు. రిజిస్టర్‌ను పరిశీలించి ప్రజలకు అందిస్తున్న సేవలను ఆరా తీశారు.

నిర్మాణ సామగ్రి వేస్తే చర్యలు

భవన నిర్మాణసామాగ్రి, వ్యర్థాలను రోడ్లపై వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన పెద్దమార్కెట్ ప్రాంతంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. వ్యర్థాలను బయట పడవేయవద్దని సూచించారు. డ్రైనేజీ పూడిక తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, ఉద్యోగులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణ వ్యయాన్ని పెంచండి



ఎమ్మెల్యే ద్వారంపూడికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న ఇళ్లకు రూ.1.8 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని సీపీఐ నాయకులు బుధవారం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కొమరిగిరి, నేమాం ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకోలేకపోవడానికి ప్రభుత్వం ఇస్తున్న రుణం సరిపోవడంలేదన్నారు. ఇసుక, సిమెంట్, ఇనుము, కూలీ రేట్లు ఎక్కువగా ఉండడం వల్ల డబ్బులు లేక ఇళ్లు నిర్మించడంలేదన్నారు. వినతిప్రతం ఇచ్చినవారిలో సీపీఐ నాయకులు తాటిపాక మధు, తోకల ప్రసాద్, కె.బోడకొండ, పి సత్యనారాయణ, కోమటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంపై బదిలీ వేటు

కాకినాడ రూరల్: రూరల్ మండల మహిళా సమాఖ్య (వెలుగు) ఏపీఎం వేద కుమారిపై బదిలీవేటు పడింది. ఇటీవల మహిళాశక్తి సంఘాలకు సంబంధించి రుణాల మంజూరులో అనేక అవకతవకలు బయటపడగా ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు ఇందిరాక్రాంతి పథం అధికారులు విచారణ నిర్వహించారు. ఒకే గ్రూపునకు రెండు చోట్ల రుణాలు మంజూరు చేయడమే కాకుండా మండలంతో సంబంధం లేని కరప మండలంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి కూడా రుణాలు మంజూరైనట్టు గుర్తించి, ఒక సీసీపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు, పది మంది వీవోఏలను తొలగించారు. ఈ నేపథ్యంలో ఏపీఎం వేదకుమారిపై కూడా బదిలీ వేటు పడింది. సెర్ప్ అధికారులు ఆమెను జిల్లా కార్యాలయానికి బదిలీ చేశారు.

యువకుడి ఆత్మహత్య

కాకినాడ క్రైం: పాత బస్టాండ్ వెంకటేశ్వర కాలనీకి చెందిన మాతా రాజీవ్ రత్నం (27) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజీవ్ రత్నం రెండున్నరేళ్ల క్రితం భార్యతో విడాకులు తీసుకున్నాడు. తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. బుధవారం వారు ఓ శుభకార్యానికి రాజమహేంద్రవరం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాజీవ్ ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి తండ్రి వరప్రసాద్ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఐ రామకోటేశ్వరరావు బదిలీ

కాకినాడ క్రైం: జిల్లా పోలీస్ శాఖలో పీఆర్‌వోగా విధులు నిర్వర్తిస్తున్న సీఐ శ్రీరామ కోటేశ్వరరావు ఏలూరు టూ టౌన్ సీఐగా బదిలీ అయ్యారు. గతంలో కాకినాడ త్రీ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. కొద్ది రోజుల క్రితం జిల్లా పోలీస్ శాఖ పీఆర్‌వోగా బాధ్యతలు స్వీకరించారు.

మధ్యతరగతికి అనుకూల బడ్జెట్



రామ్‌కుమార్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సంక్షేమ పథకాల ద్వారా పేదలకు, ఆదాయ పన్ను తగ్గింపు ద్వారా మధ్యతరగతికి అనుకూలమైన బడ్జెట్ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ కల్పన, దేశం పురోగతి చెందేలా క్యాపిటల్ వ్యయం 33 శాతం పెంచి రూ.10 లక్షల కోట్లు కేటాయించారన్నారు.

చురుగ్గా వాకింగ్ ట్రాక్ నిర్మాణం

- రూ.కోటితో సుందరీకరణ
- నిధులు మంజూరుచేసిన ఎమ్మెల్యే కన్నబాబు



రక్షితనీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చదును చేస్తున్న యంత్రం

కరప: గ్రామంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక సామూహిక రక్షిత నీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించి, విద్యుదీకరించి, పార్కు నిర్మిస్తామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఇచ్చిన హామీ మేరకు రూ.కోటి మంజూరు చేశారు.

అందరికీ ప్రయోజనం

ఈ మధ్యకాలంలో చాలామంది ఆరోగ్యం ఆవశ్యకతన గుర్తించి ఉదయపు నడక, గంట యోగా తదితర వ్యాయామాలు చేయడం నిత్యకృత్యంగా చేసుకుంటున్నారు. గ్రామస్తులు హైస్కూలు మైదానంలో నడిచేందుకు వెళ్తుండేవారు. ఆ మైదానం బాగుండక వెళ్లడం తగ్గించేశారు. కొంతమంది కాకినాడ-రామచంద్రపురం రోడ్డు, కరప-కొరుపల్లి రోడ్డుపైనే వాకింగ్ చేస్తున్నారు. మరికొంతమంది తాగునీటి చెరువుచుట్టూ ఉదయం, సాయంత్ర వేళల్లో ఈ వ్యాపకం పెట్టుకున్నారు. ఈ చెరువు చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి, నడవడానికి అసౌకర్యంగా తయారైంది. ప్రజల వినతి మేరకు ఎమ్మెల్యే కన్నబాబు స్పందించి వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. చెరువుచుట్టూ, గ్రావెల్ వేసి, నాలుగుపక్కలా విద్యుత్ లైట్లు అమర్చారు. ఈ పనులు మధ్యలో నిలచిపోయాయి. ఏడాదిగా పూర్తికాకపోవడంతో స్థానికులు ఎమ్మెల్యే కన్నబాబుకు సమస్య వివరించారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు పనులు చురుగ్గా సాగుతున్నాయి.



యాళ్ల సుబ్బారావు, జెడ్పీటీసీ, కరప

అందరికీ ఉపయోగం

వాకింగ్ ట్రాక్ అందరికీ ఉపయోగం. రక్షిత నీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి రూ కోటి మంజూరుచేశారు. ఇటీవల పనులు ఆగినా, తిరిగి మొదులపెట్టారు, వారంరోజుల్లో వినియోగంలోకి వస్తుంది.

బోధనా మెళకువలపై ముగిసిన శిక్షణ



వర్క్‌షాప్ ముగింపులో బోధనా సిబ్బందితో ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం

కాకినాడ క్రైం: బోధనా మెళకువల మెరుగుదలకు నిర్వహించిన కార్యశాల బుధవారంతో ముగిసింది. రంగరాయ వైద్య కళాశాలలో గత నెల 30న ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ సమక్షంలో వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. మరో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవి మాధవి కార్యక్రమ ఎంఈయూ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. డాక్టర్ దేవి మాధవి వివిధ విభాగాల బోధనా సిబ్బందికి వైద్య శాస్త్రంలో అధునాతన బోధన విధానాలు, అన్వయించాల్సిన మెళకువలు వివరించారు.